WWW.EPAPER.MAHAADAILY.COM

Follow: @ANNTELUGU

# మహా పత్రిక

## నల్లగొండ

01-11-2024 | శుక్రవారం, హైదరాబాద్

యాదాద్రి భువనగిరి-సూర్యాపేట



## ట్రాఫిక్ గాలికి.. వసూళ్లకు పరుగులు..

- నగరంలో ఎక్కడికక్కడే నిలుస్తున్న ట్రాఫిక్
- సమస్య పరిష్కారంపై ట్రాఫిక్ పోలీసుల దృష్టేది?

02

# రూ.600 కోట్లతో రోడ్ల అభివృద్ధి

## రెండు నెలల్లో ఎస్ఎల్‌బీసీ పనులు ప్రారంభిస్తాం.. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**మహా, నల్లగొండ రూరల్ :**

రాష్ట్రంలో ఎక్కడా మట్టి రోడ్డు అన్నదే లేకుండా రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలం పగిడిమర్రి గ్రామం సమీపంలోని సోమన్న వాగు వద్ద రూ.38 కోట్ల వ్యయంతో నిర్మించనున్న మూడు డబుల్ రోడ్లు, హైలెవల్ బ్రిడ్జి పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. అలాగే నల్లగొండ మండలం ముశంపల్లి పంచాయతీ పరిధిలోని ఐతవారి గూడెంలో సీసీ రోడ్డు పనులకు కోమటిరెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రహదారుల అభివృద్ధిలో భాగంగా రూ.30 వేల కోట్ల వ్యయంతో రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తున్నామని తెలిపారు. జిల్లాలో ఆర్అండ్‌బీ రహదారులకు



రూ.600 కోట్లు మంజూరు చేశామని, శ్రీశైలం, దేవరకొండ రహదారి అటవీ ప్రాంతంలో ఉన్నప్పటికీ అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. కనగల్ జంక్షన్‌ను రూ.8 కోట్లతో విస్తరిస్తున్నామన్నారు. దర్వేశిపురం రోడ్డు వెడల్పు పనులు నాలుగు నెలల్లో పూర్తి చేస్తామని, తిప్పర్తి జంక్షన్‌ను రూ.9 కోట్లతో వెడల్పు చేసే పనులు ప్రారంభించామని తెలిపారు. రూ.38 కోట్లతో చేపట్టిన కొత్తపల్లి, పగిడిమర్రి, అనంతారం డబుల్ రోడ్డు పనులు బుధవారం ప్రారంభించి పది నెలల్లో పూర్తి చేస్తామన్నారు. పగిడిమర్రి బ్రిడ్జితోపాటు చెక్ డ్యామ్‌లు కూడా నిర్మిస్తామని తెలిపారు. వారం రోజుల నుంచి బ్రాహ్మణవెల్లెంల లిఫ్ట్ పనులు నడుస్తున్నాయని, మూడు మాసాల్లో లక్ష ఎకరాలకు సాగు నీరు ఇవ్వనున్నామని చెప్పారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం బడ్జెట్‌ను రూ.4,600 కోట్లకు పెంచి అమెరికా నుంచి ఇంజిన్ బేరింగ్ తెప్పించి రెండు నెలల్లో పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇండ్లు ఇచ్చే కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. నవంబర్‌లో ప్రభుత్వ వైద్యశాలతోపాటు బ్రాహ్మణవెల్లెంల ప్రాజెక్ట్‌ను ముఖ్యమంత్రి ద్వారా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఎవరు ఏమి మాట్లాడినా మూసీ శుద్ధీకరణ చేస్తామని తెలిపారు.



### ఇంటి ముందు ముగ్గువేస్తున్న వారిపైకి దూసుకెళ్లిన కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు..

**మహా, మధ్యప్రదేశ్ :**

మధ్యప్రదేశ్ రాష్ట్రంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఇండోర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. ఇంటి ముందు ముగ్గు వేస్తున్న ఓ బాలిక, మహిళపైకి దూసుకెళ్లింది. సోమవారం ఉదయం రద్దీగా ఉన్న ఓ వీధిలో ఇంటి ముందు 14 ఏళ్ల బాలిక, 21 ఏళ్ల మహిళ ముగ్గు వేస్తున్నారు. ఆ సమయంలో అతి వేగంగా వచ్చిన కారు.. అదుపుతప్పి వీరిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటన అనంతరం డ్రైవర్ కారును అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో బాలిక, మహిళకు తీవ్ర గాయాలైనట్లు తెలిసింది.




### ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి..

**జీడిమెట్లలో ఘటన**

**మహా, హైదరాబాద్ :** ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాదకర సంఘటన జీడిమెట్ల పరిధి షాపూర్‌నగర్ చౌరస్తాలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రహదారి దాటుతున్న వ్యక్తిని వేగంగా వచ్చిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు పాదచారిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు.



## పండుగపూట విషాదం..

### హై టెన్షన్ వైర్ తగిలి బాలుడికి తీవ్ర గాయాలు

**మహా, హైదరాబాద్ :**

వెలుగులు నింపాల్సిన దీపావళి పండుగ వారి కుటుంబంలో చీకట్లను మిగిల్చింది. దీపాల పండుగను ఎంతో ఘనంగా జరుపుకోవాలని ఆశపడ్డ వారికి తీవ్ర నిరాశే మిగిలింది. వివరాల్లోకి వెళ్తే.. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. ఈ విషాదకర సంఘటన అంబర్‌పేటలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దీపావళి పండగ సందర్భంగా లైటింగ్ ఏర్పాటు చేస్తుండగా, ఇంటి పైనుంచి వెళ్తున్న హై టెన్షన్ వైర్ తగిలి అభి(14) అనే బాలుడి శరీరం పూర్తిగా కాలిపోయింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాలుడిని చికిత్స నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. కాగా, అభి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## కుల గణన కోసం అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తాం: మంత్రి పొన్నం



**మహా, హైదరాబాద్ :**

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో భాగంగా రాహుల్ గాంధీ ఆదేశాల మేరకు.. దేశంలో మొదటిసారి సమగ్ర కుల గణన ప్రక్రియ ఈనెల 6 వ తేదిన ప్రారంభమవుతుందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బుధవారం ఆయన గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. సమగ్ర సర్వే సక్రమంగా జరిగి భవిష్యత్‌లో అందరికి సమ న్యాయం జరిగేలా అందరు సహకరించాలన్నారు. దీనికి సంబంధించి త్వరలో అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ఉన్న కాంగ్రెస్ నాయకులు కూడా గ్రామీణ ప్రాంతాలలో అధికారులకు సహకరించాలని సూచించారు. 150 ఇళ్లకు అధికారుల బృందం సమగ్ర సమాచార సేకరణ చేపడుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అన్ని రకాలుగా అందుబాటులో ఉండాలన్నారు.